క్లుప్తంగా

ఘనంగా ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం: డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శివుడు, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు వేకువజామునే కొండమల్లీశునికి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి పాలు, పెరుగు, కుంకుమ, నారికేళ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. తదుపరి సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల పుష్పాలతో పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాల పరిశీలన


పాఠశాలలోని ఫ్లోరింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో

నగరి: మండలంలోని అర్జునప్ప కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలను ఎంఈవో శ్రీదేవి పరిశీలించారు. శనివారం పాఠశాలకు వెళ్లిన ఆమె పాఠశాలలో పూర్తయిన ఫ్లోరింగ్ పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి అవసరం


ఉపాధ్యాయుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్

కార్వేటినగరం: ఉపాధ్యాయులు విద్యాబోధనతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాజకుమార రాజ పాఠశాల ఆవరణంలో సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఈవోలు విజయ కుమార్, మనోజ్‌కుమార్ ఉపాధ్యాయులతో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిర్వహించే క్రీడా పోటీల్లో అందరూ పాల్గొని, విజయవంతం చేయాలన్నారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో భాగంగా వాలీబాల్, కబడ్డీ, టెన్నీకాయిట్, ఖోఖో తదితర క్రీడలను నిర్వహించారు.

ప్రజలు కలసి మెలసి నడుచుకోవాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం: గ్రామాల్లో ప్రజలు గొడవలు చేసుకోకుండా అందరు అన్నదమ్ముల్లా కలసి మెలసి ఉండాలని స్థానిక తహసీల్దార్ అరుణకుమారి, ఏఎస్ఐ మురుగేష్ తెలిపారు. శనివారం శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలో సాయంత్రం పౌర హక్కు చట్టంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు చేసుకుని కేసులు పెట్టుకోకూడదన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై గ్రామ ప్రజలకు తరవుగా వివరించారు. ముఖ్యంగా మద్యం తాగుడు దూరంగా ఉండాలని తెలిపారు. గ్రామంలో పిల్లలను పనికి పంచకుండా చదివించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ నాయకుడికి మాతృవియోగం

విజయపురం: మండలంలో కేశవపురం ఆది ఆంధ్రవాడ వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్ తల్లి వెంకటమ్మ శనివారం మృతి చెందింది. మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి, పార్టీ నాయకులు ఆమె మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వైఎస్సార్ వర్ధంతి రేపు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉదయం 10 గంటలకు మహానేత రాజన్నకు నివాళులు అర్పించనున్నట్లు చెప్పారు. అనంతరం కరిడివారిపల్లెలో మహానేత విగ్రహం వద్ద అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

కన్నీటి కడవ

పేదవాడి ఫ్రిడ్జ్‌గా పిలవబడే కుండలు ఆదరణ కోల్పోతున్నాయి. వాటిని చేసే కుమ్మరి వృత్తిదారులు ఉపాధి అవకాశాలు లేక వలస బాటపడుతున్నారు. ఇంకొందరు కూలి పనులకు వెళ్లి బతుకెళ్లదీస్తున్నారు. ప్రతి శుభ అశుభ కార్యక్రమాలకు కుండలు వినియోగిస్తున్న విషయం తెలిసిందే. వండే ఆహారం నుంచి దీపం వెలిగించే ప్రమిదలు, నీటి కడవలు, పాత్రలు, కంచం, పూలకుండీలను నాడు వినియోగించేవారు. కాలక్రమేణా మారిన జీవన విధానంలో మట్టి ద్వారా తయారైన వస్తువులకు ఆదరణ తగ్గిపోతోంది.
– గంగాధరనెల్లూరు


కుండలు చేస్తున్న వృత్తిదారుడు

- మరుగున పడిపోతున్న కుండల తయారీ
- మట్టి, పెట్టుబడి లేక ఇబ్బందులు పడుతున్న వృత్తిదారులు
- రాయితీ పథకాలు ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి వేడుకోలు



తయారుచేసిన దీపాలు, ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుని వ్యాపారం చేస్తున్న దుకాణదారుడు

గతంలో ప్రభుత్వం కుమ్మరి వృత్తిదారులకు ఐదు సెంట్లు స్థలం కేటాయించి అక్కడే అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టింది. దీంతో వృత్తిదారులు మట్టితో పలు వస్తువులు తయారు చేసి, అందుబాటులోకి తెచ్చేవారు. కాలక్రమేణా ప్రభుత్వం రాయితీ పథకాలు కల్పించకపోవడం, తరం మారడం, కావాల్సిన మట్టిని కొనుగోలు చేయలేకపోవడం, కుండలు కాల్చడానికి కావాల్సిన సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో వృత్తిదారులు అనాసక్తి చూపుతున్నారు. గతంలో ఆదరణ పథకంతో కొంతమేర ఆదరణ ఉండేదని తయారీదారులు అంటున్నారు.

తగ్గిన వినియోగం

ఒకప్పుడు మట్టి ద్వారా తయారైన వస్తువుల్ని విరివిగా వాడేవారు. ప్రస్తుతం మార్కెట్లోకి ఫ్రిడ్జ్‌లు, ప్లాస్టిక్, స్టీల్ వస్తువులు అధికంగా రావడంతో ప్రజలు మట్టి వస్తువుల వాడకం తగ్గించేశారు. పెట్టుబడి పెట్టి తయారు చేసిన వస్తువులు కొనుగోలు కాకపోవడంతో వృత్తిదారులు తయారీపై అనాసక్తి చూపుతున్నారు. కొందరు ఇతర రాష్ట్రాలకు వలస పోగా మరికొందరు కూలి పనులకు వెళ్తున్నారు. కడవ వ్యాపారం తెలిసిన కొందరు పక్క రాష్ట్రం నుండి తెచ్చి ఇక్కడ అమ్మకాలు చేపడుతున్నారు. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. అయితే అధిక ధరల కారణంగా, రవాణా సమయంలో విరిగి పోవడంతో నష్టాల బాట పడుతుండడంతో కుండల వ్యాపారం రోజు రోజుకు తగ్గిపోతోందిది.

పట్టణాల్లో నయా ట్రెండ్

కోవిడ్ తర్వాత మారిన జీవన విధానంలో ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించారు. సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులతోపాటు కొంతమేర మట్టితో తయారైన గ్లాసులు, చెంబులు వినియోగిస్తున్నారు. ఆకర్షించేందుకు టీ దుకాణాల్లో తాజాగా మట్టి గ్లాసుల వినియోగం కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మట్టి వస్తువుల తయారీదారులకు ప్రత్యేకంగా రాయితీలతోపాటు స్థలాలు ఏర్పాటు చేసి ప్రోత్సాహకాలు అందించాలని వృత్తిదారులు కోరుతున్నారు. కనుమరుగవుతున్న వృత్తికి తగిన గుర్తింపుని ఇచ్చి సహాయం అందించాలని, వలసల నివారణ చర్యలు చేపట్టాలని వృత్తిదారులు ఆకాంక్షిస్తున్నారు. సంఘాల ద్వారా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మట్టి వస్తువుల వాడకంతోనే ఆరోగ్యం



మట్టి వస్తువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలి అందువల్ల ఆరోగ్యం లభిస్తుంది. మునుపటి తరం మట్టిపాత్రల వినియోగించినవారు దాదాపు 80 ఏళ్ల పైగా ఆరోగ్యంగా జీవించారు. ఆదరణ లేక తయారీలు నిలిపివేశాం. బయట నుండి తెచ్చి అమ్ముకుంటున్నాం ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపట్టాలి.
– సుబ్రహ్మణ్యం శెట్టి, జీడీ నెల్లూరు

కూలి పనులకు వెళ్తున్నాం



కుండల తయారీపై ఆసక్తి ఉంది. అయితే కావాల్సిన సౌకర్యాలు లేవు. ప్రభుత్వం నుండి తోడ్పాటు లేదు. తయారు చేస్తే నష్టపోయే పరిస్థితి ఉంది. ప్రభుత్వం సాయం అందిస్తే తిరిగి మట్టి వస్తువులు తయారు చేస్తాను. కుల వృత్తులను ఆదుకునేలా ప్రభుత్వం ఆలోచన చేయాలి.
– విజయబాబు, జీడీ నెల్లూరు

దిగుమతి చేసుకుని నష్ట పోతున్నాం



తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల నుండి కుండలు, పాత్రలు, డిజైన్ దీపాలు, వాటర్ బాటిళ్లు, తోరణాలు దిగుమతి చేసుకుంటున్నాం. అయితే అక్కడి నుండి రావడానికి అధిక చార్జీలు, రవాణాలో విరిగి పోవడంతో నష్టాల పాలవుతున్నాం. ప్రభుత్వం నుంచి సహాయం కావాలి. కుమ్మరి వృత్తిదారులకు రాయితీలు, లోన్లు ఇప్పించాలి.
– సదాశివ శెట్టి, జీడీ నెల్లూరు

సారా వద్దు... కుటుంబమే ముద్దు

ఇటీవల తమిళనాడులో కల్తీ మద్యం (నాటు సారా) తాగి పెద్ద ఎత్తున మరణించినట్లు వార్తల్లో విన్నాం, చదివాం. అలాగే గతంలో పంజాబ్, అసోం, పశ్చిమబెంగాల్, బీహార్‌లలో కూడా చాలామంది కల్తీ మద్యం కారణంగా మృత్యువాడ పడ్డారు. మరి మన ఉమ్మడి రాష్ట్రంలో కూడా చాలా చోట్ల ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయి. ఇంత ప్రాణాంతకమైన నాటుసారాను ఎలా తయారు చేస్తారు. వాటిని తాగితే ఎందుకు చనిపోతారు అనే విషయం తెలుసుకుందాం.
– విజయపురం



నాటు సారా తయారీ, అమ్మకాలు, సేవించడం కొత్తకాదు. అలాగే ఈ నాటు సారా విషపూరితంగా మారి, దాన్ని తాగిన వారు మరణించడం కూడా కొత్తకాదు. అయినా నాటుసారా తయారవుతూనే ఉంది, ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు దాడులు చేసి, కేసులు పెట్టినా నాటుసారా తయారీదారుల ఆగడాలు ఆపలేకపోతున్నారు. ఫలితంగా ప్రతి ఏటా వందల మంది నాటుసారాతో మరణిస్తున్నారు. మరి కొంత మంది అనారోగ్యానికి గురై మంచంపై ఉన్నారు. నాటుసారాపై ప్రజలకు అవగాహన కలిగిస్తే కొంతైనా నివారించవచ్చు అని నిపుణులు అంటున్నారు.

నాటుసారా తయారీ

నాటుసారా అని పిలిచే ఈ మద్యాన్ని మరింత మత్తు కలిగించే పదార్థంగా మార్చే ప్రక్రియలో అది విషపూరితంగా మారుతుంది. సాధారణంగా నాటుసారాను బెల్లం, మొలాసిస్‌తో తయారు చేస్తారు. కానీ యూరియాతో పాటు ఆల్కహాల్‌ను మరింత మత్తు కలిగించడానికి ఆక్సిటోసిన్‌ను కలుపుతారు. ఇలా ఆక్సిటోసిన్‌తో తయారైన సారా మిథైల్ ఆల్కహాల్‌గా మారుతుంది. దీన్ని సేవించిన వారికి కళ్ల మంటలు, పొట్టలో నొప్పి, మంట ఏర్పడుతుంది కొన్ని రోజులకు చనిపోయే ప్రమాదం కూడా ఉంది.

ప్రాణాంతకం

కొంతమంది శరీరంలో ఈ కెమికల్ రియాక్షన్ నెమ్మదిగా జరుగుతుంది. కాబట్టి, వారికి ప్రమాదం ఉంటుంది. నాటుసారాలో 95 శాతం ఆల్కహాల్ ఉంటుంది. దీన్ని ఇథనాల్ అని కూడా అంటారు. ఇది వరకు గ్రామాల్లో పెద్దలు చెరుకు రసం, గ్లూకోజ్, బంగాళాదుంపలు, బియ్యం, బార్లీ, మొక్కజొన్న తదితర పిండి పదార్థాలను పులియబెట్టడం ద్వారా నాటుసారాను తయారు చేస్తారు. అయితే ఈ నాటుసారా మరింత మత్తుగా ఉండడం కోసం మిథనాల్‌ను కలుపుతున్నారు. ఈ మిథనాల్ కలపడంతో నాటుసారా విషపూరితంగా మారుతుంది. అందుకే నాటు సారా వద్దు... కుటుంబమే మనకు ముద్దు అంటున్నారు.

నేడు కుంభాభిషేకం

ఐరాల: మండలంలోని శ్రీరాంనగర్, చిన్నవెంకటపల్లెలో ఆదివారం నూతనంగా నిర్మించిన శ్రీరామకృష్ణ మందిర కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాజమండ్రి శ్రీరామకృష్ణా మిషన్ శ్రీమతి శ్రీశశికాంతనంద మహారాజ్ వారిచే శ్రీరామకృష్ణ మందిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు గణపతి వాస్తు శాంతి హోమం, 8 గంటలకు శ్రీ భగవాన్ శ్రీరామకృష్ణుల మందిర సంప్రోక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 గంటలకు గురుదేవుల పూజా హోమం, 10 గంటలకు నగర సంకీర్తనం, స్వామివారి ఊరేగింపు, 11 గంటలకు స్వామీజీ ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి హారతితో కుంభాభిషేకం ముగియనున్నట్లు వివరించారు.

జాగ్రత్తలు పాటించండి

తవణంపల్లె: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఏ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. గ్రామాల్లో మురుగు నీటి కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమతెరలు వాడాలని వేపాకు పొగ వేయాలని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశాకార్యకతర్తలు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు

గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలనకా రేయనకా కుక్కల బెడదతో ప్రజలు హడలి పోతున్నారు. ప్రదానంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ప్రధాన రహదారులపైనే గుంపులు గుంపులుగా చేరి దండయాత్ర చేస్తుండడంతో ప్రజలు భీతిల్లిపోతున్నారు.
– వెదురుకుప్పం


పచ్చికాపల్లంలో వీధి కుక్కల గుంపు

- గుంపులు గుంపులుగా సంచారం
- కుక్కకాటుతో ఆస్పత్రి పాలవుతున్న జనం

మండలంలో ఎక్కడపడితే అక్కడ కుక్కలు సంచరిస్తూ ప్రజలను గాయాల పాలు చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా వస్తుండడంతో ప్రజలు భయపడుతున్నారు. శునకాలు గ్రామాల్లో పరుగులు తీస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట, దేవళంపేట, కార్వేటినగరం మండలంలోని చిన్ననగరం వీధి, మండపం వీధి, శివాలయం వీధులతోపాటు ముస్లిం కాలనీ ప్రాంతాల్లో కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారులపైనే నిద్రిస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు అంటున్నారు. రాత్రి పూట అయితే కుక్కల అరుపులకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంపులుగా చేరి అరుస్తుండడంతో నిద్రలేమితో అవస్థలు పడుతున్నారు.

నెలకు 10 మంది ఆస్పత్రి పాలు

మండలంలోని వివిధ గ్రామాల నుంచి కుక్క కాటుకు గురై బాధితులు ఆస్పత్రి పాలవుతున్నారు. నెలకు పది మందికి పైగా కుక్కకాటుకి గురై చికిత్స చేసుకుంటున్నారు. పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకి గురైన బాధితులు రేబిస్ వ్యాధికి ఉచిత వైద్యం తీసుకుంటున్నారు. నివాసాల వద్ద ఉన్న కోళ్లు, మేకలు, గొర్రెలతోపాటు పాడి ఆవులను కూడా కుక్కలు కరిచి పొట్టన పెట్టుకుంటున్నాయి. కుక్కల సంచారంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులపై తిరగబడుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. వెదురుకుప్పంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల వసతి గృహం, పచ్చికాపల్లం, దేవళంపేట గ్రామాల్లో ఉన్న వసతి గృహాలు, పాఠశాలల వద్ద నిత్యం కుక్కలు సంచరిస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదాలతో బెంబేలు

ద్విచక్ర వాహనాలు నడిపే వారు కుక్కలు కనిపిస్తే చాలు బెంబేలెత్తి పోతున్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాలు వచ్చే సమయంలో కుక్కలు రోడ్ల పైకి దూసుకుపోతుండడంతో రోడ్డు ప్రమాదాలు తప్పడం లేదు. రోడ్లపైనే గుంపులుగా నిలవడంతో వాహన చోదకులకు ఆటంకంగా మారింది. కుక్కలను నియంత్రించాలని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ఇప్పటికైనా కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయనాంచారుల సమేతంగా ప్రసన్న వెంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.


తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి


ర్యాలీ చేస్తున్న ఆలిండియా తౌహిద్ జమాత్

నగరి: గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను కూకటి వేళ్లతో పెకలించాలంటూ ఆలిండియా తౌహిద్ జమాత్ ఆధ్వర్యంలో యువకులు ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక ఓంశక్తి ఆలయం సమీపంలోని బైపాస్ సర్కిల్ నుంచి టవర్ క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగంపై ఆకర్షితులయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వాటి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గంజాయి, మత్తు ఇంజక్షన్లకు వారు దూరంగా ఉండాలని ఎవరైనా విక్రయిస్తూ కనిపిస్తే పోలీసులకు, సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరానికి బహుమతిగా అందిద్దాం అన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు గోవిందస్వామి మద్దతు పలికారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

కార్వేటినగరం: సహకార బ్యాంకు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంకు మేనేజర్ వహీద అన్నారు. శనివారం డీసీసీ బ్యాంకు ద్వారా అందించే రుణాలపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీతో రుణసౌకర్యం కల్పించే బ్యాంకు డీసీసీ బ్యాంకు మాత్రమేనని అన్నారు. మున్సిపాలిటీ, మేజర్ పంచాయతీలలో హౌసింగ్ నిర్మాణానికి రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ట్రేడర్స్‌పై రుణాలు, మహిళలకు ఎస్‌హెచ్‌జీ రుణాలు, అర్హత మేరకు రూ.2 లక్షల నుండి రూ.20 లక్షల వరకు రుణాలు అత్యంత తక్కువ వడ్డీకే అందిస్తామన్నారు. బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో రుణసౌకర్యం ఉంటుందని తెలిపారు. 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల్లోపు ఉన్నవారు సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యువజన ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా డీసీసీ బ్యాంకులో ఉందని చెప్పారు. ఇతర వివరాలకు డీసీసీ బ్యాంకును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఢిల్లీ బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


డీసీసీ బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ వహీద

కౌన్సిలర్లకు విలువ ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం

నగరి: కౌన్సిలర్లకు విలువ ఇవ్వడం లేదని, వారికి తెలియకుండా పనులు చేపడుతున్నారని మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశపు హాలులో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన కమిషనర్ మంజునాథ్ గౌడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ ఆదేశానుసారం అజెండాను మున్సిపల్ అధికారులు కౌన్సిల్‌కు చదివి వినిపించారు. అజెండాలో అన్నా క్యాంటీన్ మరమ్మతులకు రూ.4.35 లక్షలు అవుతుందని, సదరు ఖర్చును గ్రాంటు నుండి గానీ సాధారణ నిధుల నుండి గానీ ఖర్చుచేయడానికి, మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులకు మంజూరైన గ్రాంటు రూ.42 లక్షల్లో సుమారు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు కౌన్సిల్ అనుమతి కోరుతున్నట్లు పొందుపరిచారు. దీనిపై కౌన్సిలర్ దయానిధి మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ మరమ్మతులకు సంబంధిత పనులు ఇప్పటికే పూర్తయిందని, పారిశుధ్య పనులు కూడా జరిగిపోయాయని ఆ పనులకు కౌన్సిల్ అనుమతి కోరడమేంటని ప్రశ్నించారు. ఏ పనులు చేస్తున్నారో చెప్పడానికి కూడా కౌన్సిలర్లు పనికిరారా అని అడిగారు. అంతా చేసి అజెండాలో పెట్టేస్తే కౌన్సిలర్లు ఎందుకు ఉండేదన్నారు. తాము అన్నా క్యాంటీన్ పనులకో, పారిశుధ్య పనులకో వ్యతిరేకం కాదని, దానికి అడ్డుపడమని కౌన్సిలర్ల సమ్మతితోనే చేయాలని కోరుతున్నామని, కౌన్సిలర్లకు విలువ ఇవ్వాలని కోరారు. దీనికి కమిషనర్ వివరణ ఇస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే క్యాంటీన్ పనులు త్వరితగతిన చేపట్టామన్నారు. చైర్మన్ మాట్లాడుతూ వర్షాకాలంలో మురుగు సమస్య ఎదురు కాకూడదనే పారిశుధ్య పనులు ముందస్తుగా చేపట్టామన్నారు. ఇకపై ప్రతి పని ఎమర్జెన్సీ సమావేశం పెట్టి కౌన్సిలర్లకు తెలియపరచే చేస్తామన్నారు. కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించి అర్థంతరంగా ఆపేసి ఉన్నారని దానిని పూర్తిచేయాలన్నారు. ఈ అంశంపై డీఈ నరేష్ సమాధానమిస్తూ గుడ్‌విల్ బేసిస్‌లోనే కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని షాపులకు దరఖాస్తు చేసుకున్నవారు ఇచ్చిన తొలివిడత నిధులు రూ.62 లక్షలు వచ్చిందని దానికి సరిపడా పనులు జరిగాయన్నారు. రెండో విడత నిధులు వసూలు చేసే నిర్మాణం ప్రారంభించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ దరఖాస్తుదారులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి వివరాలు తెలిపి రెండో విడత నిధులు సిద్ధం చేసుకుని కాంప్లెక్స్ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వెంకటరత్నం, బాలన్, సీడీపీవో కృష్ణవేణి, హౌసింగ్ ఏఈ భాస్కర్, డీటీ మేఘవర్ణం, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

9,289 మందికి పింఛన్ల పంపిణీ

తవణంపల్లె: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో సచివాలయ సిబ్బందిచే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలో 9,746 వివిధ పింఛన్ లబ్ధిదారులకు రూ.4,01,62,000 డబ్బులు మంజూరైనట్లు వివరించారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి సచివాలయ సిబ్బంది 9,289 మంది లబ్ధిదారులకు ఫించన్ నగదు అందజేసినట్లు వివరించారు. అందుబాటులో లేని కొంతమందికి ఆదివారం పంపిణీ చేస్తామని తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యకర ప్రసవం

ఐరాల: పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర ప్రసవానికి మార్గం సుగమం అవుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని నెల్లిమందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ పోషకాహారం లోపం వల్ల రక్తహీనత లాంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఫలితంగా ఆరోగ్యకర బిడ్డకు జన్మనివ్వడం కుదరదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర బిడ్డకు జన్మ ఇవ్వచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


గర్భిణులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్